www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily | శుక్రవారం 21,ఆగస్టు, 2026

# వరాలిచ్చే దేవత వరలక్ష్మి



3 లో..

నేడు వరలక్ష్మీ వ్రతం

శుభాలు కలగాలని వ్రతాల నిర్వహణ

స్కాంద పురాణంలో వరలక్ష్మీ వ్రతం గురించి పరమేశ్వరుడు వివరించిన వైనం

ప్రత్యేకతను సంతరించుకున్న వరలక్ష్మి

వ్రతాల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్న మహిళలు

భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 20( భద్రాద్రిన్యూస్ ): శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీ వ్రతాలు నిర్వహిస్తారు. ముఖ్యంగా మహిళలు ఈ వ్రతాలను ఆచరిస్తారు. గృహాలను శు భ్రంగా నీటితో కడిగి ఉదయాన్నే తలంటి స్నానాలను ఆచరించి వ్రతానికి కావలసిన ఏర్పాట్లను సిద్ధం చేసుకుని భక్తిశ్రద్ధలతో వ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. వరలక్ష్మి దేవత విష్ణుమూర్తి భార్య. హిందూ మత ప్రకారం ఈ పండుగ విశిష్టమైనది. వరాలు ఇచ్చే దేవతగా వరలక్ష్మి దేవిని కొలుస్తారు. వరలక్ష్మి దేవతను పూజిస్తే అష్టలక్ష్మి పూజలకు సమానం అనే నమ్మకంతో కుటుంబ సభ్యులు కూడా పాలుపంచుకుంటారు.

పల్లె ప్రజలే టార్గెట్.. గ్యాస్ బండపై

## రూ.40 బాదుడు!




2లో

డెలివరీ, ట్రాన్స్‌పోర్ట్ పేరుతో అదనపు వసూళ్లు...

ఇంటి గుమ్మం వరకు సిలిండర్ దిగుమతి చేయకుండానే చార్జీలు!

బిల్లు అడిగితే "సంతకమే బిల్లు"..

భారత్ గ్యాస్ తీరుపై గ్రామీణ వినియోగదారుల ఆగ్రహం

పల్లె ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటున్నారంటూ ఆరోపణలు..

అధికారుల తక్షణ జోక్యానికి డిమాండ్

## అభివృద్ధి, ప్రజా సేవలపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు



2లో

పట్వారిగూడెం పీహెచ్‌సీలో ఏడాదిగా పనిచేయని అనాలిసిస్ యంత్రంపై కలెక్టర్ ఆగ్రహం

"మీ ఇంట్లో పరికరం పనిచేయకపోతే ఇలాగే వదిలేస్తారా?"

గండుగులపల్లిని మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేయాలి

242 ఇళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పూర్తి

గురుకుల పాఠశాలలో పరిశుభ్రత, మెనూ అమలులో నిర్లక్ష్యంపై ఆగ్రహం -- ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు

# దమ్మపేట మండలంలో అభివృద్ధి, ప్రజా సేవలపై కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు





**దమ్మపేట,ఆగస్టు 20 (భద్రాద్రిన్యూస్ ):**
దమ్మపేట మండలంలో అభివృద్ధి పనులు, ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇందులో భాగంగా పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గండుగులపల్లి మోడల్ సోలార్ గ్రామం, మదనపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.
దమ్మపేట మండలం పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్.. ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ రోగుల వివరాలు, వైద్యులు, సిబ్బంది హాజరు తదితర అంశాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ రిజిస్టర్లు, సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు.
రక్త పరీక్షల విభాగాన్ని పరిశీలించిన సందర్భంగా అనాలసిస్ యంత్రం పనిచేయకపోవడాన్ని కలెక్టర్ గమనించారు. అది ఎప్పటి నుంచి పనిచేయడం లేదని సిబ్బందిని ప్రశ్నించగా, సుమారు ఏడాది కాలంగా పనిచేయడం లేదని తెలిపారు. యంత్రం నిర్వహణ, మరమ్మతుల కోసం ఇప్పటికే దరఖాస్తు సమర్పించామని సిబ్బంది వివరించారు.
దీనిపై జిల్లా వైద్యాధికారిని ఫోన్‌లో సంప్రదించిన కలెక్టర్.. "మీ ఇంట్లో ఏదైనా పరికరం పనిచేయకపోతే ఇలాగే వదిలేస్తారా?" అని ప్రశ్నించారు. సుమారు రూ.3 లక్షల విలువైన వైద్య పరికరం ఏడాది కాలంగా పనిచేయకపోయినా దాని మరమ్మతులు, నిర్వహణకు సకాలంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన కీలకమైన పరికరాలు పనిచేయని పరిస్థితిలో ఉంటే వెంటనే స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న వైద్య పరికరాల పనితీరును సమగ్రంగా పరిశీలించి, పనిచేయని పరికరాలను వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలోని వైద్య పరికరాల నిర్వహణ బాధ్యతను సంబంధిత మెడికల్ అధికారి లేదా ప్రత్యేక అధికారికి అప్పగించాలని, అవసరమైన ప్రతిపాదనలను వెంటనే సమర్పించాలని ఆదేశించారు.
అనంతరం దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మోడల్ సోలార్ గ్రామం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న సోలార్ పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లలో ఏర్పాటు చేస్తున్న సోలార్ ప్యానెళ్లను పరిశీలించి, సోలార్ యూనిట్ల ఏర్పాటు, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.
గ్రామంలో మొత్తం 424 మంది గృహజ్యోతి లబ్ధిదారులకు సోలార్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో స్లాబ్ ఉన్న 250 ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పటివరకు 242 ఇళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పనులు పూర్తయ్యాయని వివరించారు. 2 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ యూనిట్‌ను ఒక్కో ఇంటికి సుమారు రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో యూనిట్ ద్వారా సుమారు 8 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, లబ్ధిదారులు తమ గృహ అవసరాలకు వినియోగించుకున్న అనంతరం మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వం కొనుగోలు చేసి యూనిట్‌కు రూ.2 చొప్పున చెల్లిస్తుందని వివరించారు.
ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్.. సోలార్ యూనిట్ల ద్వారా పొందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. గృహజ్యోతి పథకంతో పాటు సోలార్ యూనిట్లను సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మిగిలిన ఇళ్లలో సోలార్ యూనిట్ల ఏర్పాటు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, గ్రామాన్ని ఆదర్శవంతమైన మోడల్ సోలార్ గ్రామంగా అభివృద్ధి చేసేలా పనులను సమన్వయంతో, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.
అనంతరం మదనపల్లి గ్రామంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, కిచెన్, డైనింగ్ హాల్, తరగతి గదులు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, ఉపాధ్యాయులు, సిబ్బంది వివరాలను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు.
డిజిటల్ క్లాస్‌రూమ్‌లో చెత్తాచెదారం, అపరిశుభ్ర వాతావరణం ఉండటంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన పాఠశాలలో తరగతి గదులను సైతం పరిశుభ్రంగా ఉంచకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, ఇతర ప్రాంతాలను వెంటనే పూర్తిస్థాయిలో శుభ్రం చేసి, తీసుకున్న చర్యలకు సంబంధించిన ఫోటోలను పంపించాలని ఆదేశించారు.
అనంతరం డైనింగ్ హాల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న భోజనంపై వివరాలు తెలుసుకున్నారు. ఆ రోజు మెనూ ఏమిటని, మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా లేదా అని విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం కిచెన్‌ను పరిశీలించి భోజనం తయారీ, ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. మెనూలో పేర్కొన్న కూర అందుబాటులో లేకపోవడాన్ని గుర్తించిన కలెక్టర్ వార్డెన్‌ను ప్రశ్నించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం ఎందుకు అందించడం లేదని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం, అలసత్వాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు.
డైనింగ్ హాల్‌లో డస్ట్‌బిన్ ఉన్నప్పటికీ దానిని సక్రమంగా నిర్వహించకపోవడంతో హాల్‌లో అపరిశుభ్రత నెలకొనడంపై కలెక్టర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు భోజనం చేసే ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన కనీస బాధ్యతను కూడా విస్మరించడంపై ప్రశ్నించారు. డైనింగ్ హాల్‌తో పాటు పాఠశాలలోని అన్ని ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, చెత్తాచెదారం కనిపించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.
పాఠశాల నిర్వహణ, పరిశుభ్రత, మెనూ అమలులో నిర్లక్ష్యం వహించినందుకు ప్రిన్సిపాల్, వార్డెన్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. బాధ్యతల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమం, ఆరోగ్యం, భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.
అదేవిధంగా పాఠశాలలో విద్యుత్ సదుపాయాలను పరిశీలించిన కలెక్టర్ అవసరమైన లైట్లు, ఇతర విద్యుత్ పరికరాలకు సంబంధించిన ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణంతో పాటు పరిశుభ్రమైన పరిసరాలు, నాణ్యమైన భోజనం, అవసరమైన మౌలిక సదుపాయాలు అందేలా పాఠశాల నిర్వాహకులు బాధ్యతతో వ్యవహరించాలని, ప్రతి అంశాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.
ఈ పరిశీలనల్లో జిల్లా కలెక్టర్ అంకిత్ వెంట శిక్షణ డిప్యూటీ కలెక్టర్, దమ్మపేట తహసీల్దార్ మురళి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రజలే టార్గెట్.. గ్యాస్ బండపై రూ.40 బాదుడు!

**బిల్లు లేదు.. బుక్కులో సంతకమే!**




**బోనకల్(భద్రాద్రి న్యూస్):- ఆగస్టు 20:**

పల్లె ప్రజలే టార్గెట్‌గా మారారా? బోనకల్ గ్రామంలోని వత్సవాయి రోడ్డులో ఉన్న భారత్ గ్యాస్ ఏజెన్సీ వ్యవహారంపై గ్రామీణ వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.డెలివరీ, ట్రాన్స్‌పోర్ట్ చార్జీల పేరుతో ఒక్కో గ్యాస్ సిలిండర్‌కు రూ.35 నుంచి రూ.40 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.
మండల కేంద్రం నుంచి తమ గ్రామాల వరకు గ్యాస్ వాహనం వస్తుందనే విషయాన్ని ఆసరాగా చేసుకుని అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు. అదనపు డెలివరీ చార్జీ తీసుకుంటున్నప్పటికీ కనీసం ఇంటి గుమ్మం వరకు సిలిండర్‌ను తీసుకెళ్లి దింపడం లేదని ఆరోపిస్తున్నారు.

**పల్లె ప్రజల అవసరమే ఆసరానా?**

గ్యాస్ సిలిండర్ ప్రతి ఇంటికి తప్పనిసరి నిత్యావసరం కావడంతో.. దాని కోసం వినియోగదారులు తప్పనిసరిగా ఏజెన్సీపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని అదనపు డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.
అదనపు చార్జీలపై ప్రశ్నిస్తే మేము ప్రజల కోసమే పనిచేస్తున్నాం.. కనీసం బండకు రూ.40 ఇవ్వలేరా?" అంటూ ఘాటుగా సమాధానం చెబుతున్నారని వినియోగదారులు అంటున్నారు. దీంతో తమ సమస్యను ప్రశ్నించేందుకు కూడా భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని కొందరు వాపోతున్నారు.
ఇక బిల్లు విషయంలోనూ వినియోగదారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సిలిండర్ తీసుకున్న తర్వాత సరైన బిల్లు ఇవ్వకుండా బుక్కులో సంతకం మాత్రమే తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. బిల్లు అడిగితే "సంతకమే బిల్లు" అంటూ సమాధానం ఇస్తున్నారని చెబుతున్నారు.
దీంతో సిలిండర్ అసలు ధర ఎంత? అదనంగా తీసుకుంటున్న రూ.35--40 ఏ చార్జీకి సంబంధించినది? అనే విషయాల్లో గ్రామీణ వినియోగదారులకు స్పష్టత లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల పర్యవేక్షణ ఏది?**

పల్లె ప్రజల నుంచి అదనపు వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నా సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బోనకల్ భారత్ గ్యాస్ ఏజెన్సీపై అధికారులు తక్షణమే విచారణ చేపట్టి, అదనపు వసూళ్ల ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు జరుగుతున్నట్లు తేలితే సంబంధిత ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు సరైన బిల్లులు అందేలా చూడాలని కోరుతున్నారు.
"పల్లె ప్రజల జేబులపై భారం వేస్తుంటే అధికారులు చూస్తూ ఊరుకుంటారా? గ్రామీణ వినియోగదారులకు న్యాయం చేసేది ఎవరు?" అంటూ బోనకల్ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

# వరాలిచ్చే దేవత వరలక్ష్మి

**మొదటి పేజీ తరువాయి**

మంచి భర్త రావాలని అమ్మాయిలు కూడా వరలక్ష్మీ దేవతను పూజిస్తారు. దేవతను పూజిస్తే అష్టైశ్వర్యాలు తోపాటు సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి లభిస్తుందని నమ్మకం. శ్రావణమాసం కూడా పవిత్రమైన మాసం కావడంతో వరలక్ష్మీ వ్రతాలు చేసుకుంటే అన్ని శుభాలు కలుగుతాయని మహిళలు, భక్తుల నమ్మకం. ఈ క్రమంలోనే వ్రతాలను భక్తిశ్రద్ధలతో చేపడతారు. వ్రతాల నిర్వహణకు పురాణ గాథలు ఉన్నాయి. స్కాంద పురాణంలో పరమేశ్వరుడు వరలక్ష్మీ వ్రతం గురించి పార్వతీ దేవికి వివరించినట్లు పేర్కొన్నారు. ఈ లోకంలో స్త్రీలు సకల అష్టైశ్వర్యాలను, పుత్ర పౌత్రాదులను పొందేందుకు వీలుగా ఏదైనా ఒక వ్రతాన్ని సూచించమని పార్వతి దేవి ఆది దేవుడిని కోరుతుంది. ఈ క్రమంలో శంకరుడు గిరిజకు వరలక్ష్మి వ్రత మహత్యాన్ని వివరించారని పేర్కొన్నారు. ఈ సందర్భంలోనే శివుడు ఆమెకు చారుమతి దేవి వృత్తాంతాన్ని తెలియజేశాడని అంటున్నారు. భర్త పట్ల ఆదరాన్ని, అత్తమామల పట్ల గౌరవాన్ని ప్రకటిస్తూ చారుమతి ఉత్తమ ఇల్లాలుగా తన బాధ్యతలను నిర్వహిస్తూ ఉండేది. మహాలక్ష్మి దేవి పట్ల ఎంతో భక్తిశ్రద్ధలు కలిగిన చారుమతి అమ్మవారిని త్రికరణ శుద్ధిగా పూజించేది. ఆ మహా పతివ్రత పట్ల వరలక్ష్మీదేవికి అనుగ్రహం కలిగి స్వప్నంలో ఆమెకు సాక్షాత్కరిస్తుంది. శ్రావణ శుక్ల పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం తను ఆరాధిస్తే కోరిన వరాలన్నీ ఇస్తానని ఆమెకు దేవదేవి అభయమిస్తుంది. అమ్మ ఆదేశానుసారం వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించి చారుమతి సమస్త సిరిసంపదలని అందుకుందని ఈశ్వరుడు గౌరీకి విషదపరిచాడని పురాణ కథనం. ఈ క్రమంలో పార్వతి దేవి కూడా ఈ వ్రతాన్ని ఆచరించి వరలక్ష్మి కృపకు పాత్రురాలైందని చెబుతుంటారు. అష్టలక్ష్ముల్లో వరలక్ష్మి దేవికి ఓ ప్రత్యేకత ఉంది. మిగిలిన లక్ష్మీ పూజల కంటే వరలక్ష్మి పూజ శ్రేష్టమని శాస్త్రం చెప్తుంది. శ్రీహరికి ఇష్టమైన పైగా విష్ణు జన్మ నక్షత్రమైన శ్రవణం పేరిట వచ్చే శ్రావణమాసంలో ఈ వ్రతాన్ని చేస్తే విశేష ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. సర్వ మంగళ సంప్రాప్తి కోసం, సకలాభీష్టాల కోసం, నిత్య సుమంగళీగా వర్ధిల్లాలని పుణ్యస్త్రీలు ఈ వ్రతాలను చేస్తారు. వ్రతాల నిర్వహణకు కావలసిన సామాగ్రిని మహిళలు సిద్ధం చేసుకున్నారు. పసుపు, కుంకుమ, తమలపాకులు, వక్కలు, అరటి పండ్లు, అగరవత్తులు, హారతి కర్పూరం, పసుపు అక్షింతలు, పూలు, కొబ్బరికాయ, పంచామృతాలు, నూనె, ఆవు నెయ్యి, అమ్మవారికి కలశము, అర్చన కలశము, బియ్యం తదితర సామాగ్రి సిద్ధం చేసుకున్నారు. అమ్మవారిని అలంకరించేందుకు కావలసిన వస్తువులను ఏర్పాటు చేసుకున్నారు. ముందుగా పసుపుతో గణపతిని చేసి పూజిస్తారు. కలశం లోనికి వరలక్ష్మి దేవిని ఆవాహన చేసి షోడోపచార పూజలు నిర్వహించిన అనంతరం అధాంగ పూజ చేస్తారు. ఆ తర్వాత అష్టోత్తర శతనామ పూజతో నామాలను చదివి ధూప దీప నైవేద్యాలను సమర్పించి కర్పూర నీరాజనం మంత్రపుష్పం సమర్పించి మంగళహారతి ఇచ్చి పూజలను చేస్తారు. ముత్తయిదువకు తాంబూలాలను సమర్పిస్తారు. వరలక్ష్మీ వ్రత కథను చదువుతారు. ఉపవాస దీక్షలను ఆచరిస్తారు. పుణ్య ఫలితాలు కలగాలని శుభాలు జరగాలని వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు జరుపుకునేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు.

# పాము కాటుకు గురైన సోడి సుబ్బమ్మ

**వ్యవసాయ పనుల్లో పాము కాటు.. మహిళా రైతు ఆసుపత్రికి మండలంలో పెరుగుతున్న పాము కాటు కేసులు.. అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన**



**భద్రాద్రి న్యూస్ ఆగస్టు 20 దుమ్ముగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నందులచలక గ్రామానికి చెందిన సోడి సుబ్బమ్మ (49) వ్యవసాయ పనుల నిమిత్తం గురువారం ఉదయం పొలానికి వెళ్లారు. పొలం గట్లకు నీరు ఆపేందుకు అడ్డకట్టలు వేస్తుండగా ఆమె కుడికాలికి గుర్తుతెలియని పాము కాటు వేసింది. వెంటనే కుటుంబ సభ్యులు సుబ్బమ్మను నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ వైద్యురాలు డాక్టర్ పావని రెడ్డి ఆమెను పరిశీలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్ ద్వారా భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మండలంలో పాము కాటు ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. పొలాల్లో పనులు చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలని, పాము కాటుకు గురైన వెంటనే బాధితులను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. పాము కాటు చికిత్సకు అవసరమైన యాంటీ స్నేక్ వీనం (ఏఎస్వి) ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయని వైద్యులు తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్లే సమయంలో పాదాలను పూర్తిగా కప్పే రక్షణ పాదరక్షలు ధరించాలని, పొదలు, గడ్డి ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలకు భయపడాల్సిన అవసరం లేదు

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 20 (భద్రాద్రిన్యూస్) :**

ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధులకు ప్రస్తుతం అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని , ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ప్రమాదకరమనే అపోహను ప్రజలు వీడాలని యశోద ఆసుపత్రి సోమాజిగూడ శాఖకు చెందిన థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి అన్నారు . గురువారం ఖమ్మం జిల్లా కేంద్రంలో యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ థొరాసిక్ సర్జరీ అంటే కేవలం గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స కాదని , గుండెకు సంబంధించిన శస్త్రచికిత్సలను కార్డియో థొరాసిక్ సర్జరీగా పిలుస్తారని తెలిపారు . ఊపిరితిత్తులు , ఛాతీ భాగానికి సంబంధించిన శస్త్రచికిత్సలకు ప్రత్యేకంగా థొరాసిక్ సర్జరీ అనే విభాగం ఉందన్నారు . ముఖ్యంగా కొవిడ్ తర్వాత ఊపిరితిత్తుల వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరిగిందని చెప్పారు . ఊపిరితిత్తులకు సంబంధించిన అనేక సమస్యలకు ప్రస్తుతం ప్రత్యేక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని అన్నారు . యశోద ఆసుపత్రి సోమాజిగూడలో పల్మనాలజీ , థొరాసిక్ సర్జరీ సేవలను 24 గంటలూ అందిస్తున్నామని చెప్పారు . అదేవిధంగా ఊపిరితిత్తుల మార్పిడి (లంగ్ ట్రాన్స్‌ప్లాంట్) సేవలను కూడా ప్రారంభించామని , ఇప్పటికే విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించి పలువురు రోగులు కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారని వివరించారు . ఎండ్ స్టేజ్ లంగ్ డిసీజ్‌తో బాధపడుతున్న వారికి ఊపిరితిత్తుల మార్పిడి కొత్త జీవితాన్ని అందించే అవకాశముందని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు . ఇంటర్‌స్టీషియల్ లంగ్ డిసీజెస్ , ధూమపానం కారణంగా వచ్చే సీఓపీడీ వంటి వ్యాధుల్లో ఒక దశ తర్వాత ఊపిరితిత్తుల పనితీరు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంటుందని చెప్పారు . అలాంటి




రోగులు శ్వాస తీసుకోవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతూ, ఆయాసంతో జీవన్మరణ పరిస్థితిని ఎదుర్కొంటారని, వారికి లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు . క్షయ వ్యాధి కారణంగా ఊపిరితిత్తుల్లో కొంత భాగం దెబ్బతినడం, దగ్గులో రక్తం పడటం , ఊపిరితిత్తుల క్యాన్సర్ వంటి సమస్యలకు కూడా శస్త్రచికిత్స అవసరం కావచ్చని తెలిపారు . ప్రస్తుతం ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ఆధునిక పద్ధతుల్లో శస్త్రచికిత్సలు చేస్తున్నామని చెప్పారు . మినిమల్ ఇన్వేసివ్ థొరాసిక్ సర్జరీ ద్వారా చిన్న కోతలతోనే ఊపిరితిత్తుల్లోని వ్యాధిగ్రస్త భాగాన్ని తొలగించే అవకాశం ఉందన్నారు . సాధారణంగా ఒకటి నుంచి రెండు సెంటీమీటర్ల పరిమాణంలో చిన్న కోతలతో శస్త్రచికిత్స చేయడం వల్ల రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు . దీనికి మరింత ఆధునిక రూపంగా రోబోటిక్ థొరాసిక్ సర్జరీ అందుబాటులోకి వచ్చిందని , యశోద ఆసుపత్రిలో ఈ సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని చెప్పారు . గతంలో ఊపిరితిత్తుల శస్త్రచికిత్స అంటే చాలా ప్రమాదకరమని భావించి రోగులు భయపడేవారని , ప్రస్తుతం ఆధునిక వైద్య సాంకేతికతతో ఈ శస్త్రచికిత్సలు సురక్షితంగా నిర్వహించగలుగుతున్నామని డాక్టర్ రోహన్ రెడ్డి పేర్కొన్నారు . సూర్యాపేట , ఖమ్మం ప్రాంతాల నుంచి కూడా పలువురు రోగులకు శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు . ప్రజలకు ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు ఉంటే భయపడకుండా నిపుణులైన వైద్యులను సంప్రదించాలని సూచించారు . కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల్లో ఎవరికైనా ఊపిరితిత్తుల సంబంధిత సమస్యలు ఉంటే ఈ సమాచారాన్ని వారికి చేరవేయాలని మీడియా ప్రతినిధులను కోరారు . ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు ఇకపై భయపడాల్సినంత ప్రమాదకరమైనవి కావు . ఆధునిక మినిమల్ ఇన్వేసివ్ , రోబోటిక్ థొరాసిక్ సర్జరీలతో సురక్షితంగా చికిత్స అందించవచ్చు . అవసరమైన రోగులకు లంగ్ ట్రాన్స్‌ప్లాంట్ కూడా సాధ్యమే. సరైన సమయంలో నిపుణులను సంప్రదిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చు" అని డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు . ఈ కార్యక్రమంలో యశోదా ఆసుపత్రి సీనియర్ మేనేజర్ శ్రీధర్ , అసిస్టెంట్ మేనేజర్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు

# రెజోనెన్స్ స్కూల్ శ్రీనివాస నగర్ లో రూపా రెడ్డి సంతాప సభ

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 20 (భద్రాద్రిన్యూస్ ):-**




శ్రీనివాస నగర్ లోని ప్రముఖ విద్యాసంస్థ రెజోనెన్స్ స్కూల్ లో, నాగార్జున పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ , ప్రిన్సిపాల్ రూపా రెడ్డి అకాల మరణం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతిని, సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ రోజు పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సంతాప సభలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం అయిన డైరెక్టర్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ , నీలిమా మాట్లాడుతూ.. విద్యా రంగంలో ఎంతో అనుభవజ్ఞురాలైన రూపా రెడ్డి విద్యార్థుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారు. ఒక ప్రిన్సిపాల్గా కాకుండా, విద్యార్థులకు మార్గదర్శిగా, ఉపాధ్యాయులకు స్నేహితురాలిగా ఆమె అందించిన సేవలు మరువలేనివి. ఆమె క్రమశిక్షణ, విద్యా విధానం ఎంతోమంది విద్యార్థులను ఉన్నత స్థానాల్లో నిలబెట్టాయి. రూపా రెడ్డి మరణం మొత్తం విద్యా రంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె ఆత్మకు సద్గతి కలగాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సంతాప సభలో రెజోనెన్స్ స్కూల్ డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

# జాహ్నవి చదువుకు 20,000 ఆర్థిక సాయం...

**మానవత్వం చాటుకున్న లయన్స్ క్లబ్ సభ్యులు..**

**పాల్వంచ, ఆగస్టు20 (భద్రాద్రి న్యూస్):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లయన్స్ క్లబ్ ఆఫ్ కిన్నెర పాల్వంచ సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో పై చదువులకు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాల్వంచ పట్టణంలోని రాహుల్ గాంధీ నగర్ కు చెందిన జాహ్నవి విషయం తెలుసుకుని గురువారం లయన్స్ క్లబ్ అధ్యక్షులు చేపూరి బ్రహ్మచారి జాహ్నవి పై చదువుల నిమిత్తం ( పోస్ట్ గ్రాడ్యుయేషన్ ) రూ 20,000/- ల చెక్కును ను జాహ్నవి తండ్రి ఈశ్వర్ కు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు ఎవరైనా పై చదువుల కోసం ఇబ్బంది పడుతుంటే తమ సంస్థకు తెలియజేస్తే ఆర్థికంగా ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు లయన్ డాక్టర్ సుధాకర్ మరియు లయన్ మామిడిశెట్టి రాజమనోహార్ లు పాల్గొన్నారు

భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 21,ఆగస్టు, 2026

## రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు నిజమైన నివాళి

**– టి.పి.సి.సి సభ్యులు జె.బి. శౌరి**

**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 20 (భద్రాద్రి న్యూస్) :**



మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను కొత్తగూడెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టి.పి.సి.సి సభ్యులు జె.బి. శౌరి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా జె.బి. శౌరి మాట్లాడుతూ... దేశాన్ని ఆధునిక, సాంకేతిక భారతదేశంగా తీర్చిదిద్దేందుకు దూరదృష్టితో కృషి చేసిన మహానేత రాజీవ్ గాంధీ అని అన్నారు. యువతకు రాజకీయాల్లో ప్రాధాన్యత కల్పించడంతో పాటు కంప్యూటర్, సమాచార సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన వేసిన పునాదులు నేటి భారతదేశ ప్రగతికి ఎంతో దోహదపడ్డాయని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, యువతకు మెరుగైన అవకాశాల కల్పన వంటి అంశాలకు రాజీవ్ గాంధీ ఎంతో ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. ఆయన ఆశయాలు, ఆలోచనలు నేటి యువతకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. "దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నమ్మిన మహానేత రాజీవ్ గాంధీ. ఆయన కలలు కన్న ఆధునిక, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. రాజీవ్ గాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి" అని జె.బి. శౌరి అన్నారు. రాజీవ్ గాంధీ చూపిన అభివృద్ధి, ప్రజాసేవ మార్గంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం టౌన్ కన్వీనర్ ఎం.డి. గౌస్ మోహినుద్దీన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు సురేష్ అజ్మీర, మాజీక్ ఆప్షన్ మెంబర్ ఆరిఫ్ ఖాన్, యువజన కాంగ్రెస్ టౌన్ ఉపాధ్యక్షులు ఉస్మాన్ అలీ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గాండ్ల సురేష్, నిరంజన్, సమ్మయ్య, కోటిరెడ్డి, దేవేందర్‌రావు, ఎం.డి. అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక అవసరతలు గల పిల్లలకు క్రీడా పోటీలు

**– అన్నపురెడ్డిపల్లి మండల విద్యాశాధికారి ఉండేటి ఆనంద కుమార్**

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 20 (భద్రాద్రి న్యూస్) :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట లోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరతలు (మానసిక వికలాంగులు) పిల్లలకు భద్రాద్రి జిల్లా విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ఆటల పోటీలను నిర్వహించారు. ప్రాధమిక పాఠశాల ఎర్రగుంట భవిత కేంద్రం ప్రధానోపాధ్యాయులు వసుంధర ఆధ్వర్యంలో జరిగిన ఈ క్రీడా పోటీలను అన్నపురెడ్డిపల్లి మండల విద్యాశాధికారి ఉండేటి ఆనంద కుమార్ ప్రారంభించారు. పరుగు పందెం, త్రోబాల్, అకారాలను అమర్చడం లాంటి ఆటలను ఆడించారు. ప్రత్యేక ఇంగ్లాండ్ గల పిల్లల వైద్యురాలు డా. కుమారి, ఉన్నత పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు లకావత్ జయరాం లు ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల ద్వారా పి. నాగశ్రీ, నవ్య శ్రీ, అరిఫా, నిషా, శివరాం శంకర్, దిలీప్ కుమార్ లు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాకాధికారి ఉండేటి ఆనంద కుమార్ మాట్లాడుతూ... ప్రత్యేక అవసరతలు గల (మానసిక వికలాంగులు) పిల్లలకు ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందని, వాటిని వారు వినియోగించుకోవాలని తెలియజేసారు. అంతే కాకుండా సమాజం కూడా వారికీ చేయూతను ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయులు, పిల్లల తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నీటి నిల్వ కోసం ఫారం పాండ్...

**పాల్వంచ, (భద్రాద్రి న్యూస్ ):**





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని నాగారంకాలనీ , తొగ్గూడం గ్రామపంచాయతీ పరిధిలోనీ రైతు బానోత్ బద్రు పొలంలో 20 ఐ 20 మీటర్ల విస్తీర్ణంలో, 3 మీటర్ల లోతుతో ఫారం పాండ్ నిర్మాణాన్ని గురువారం ఎంపీడీవో ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో పి. రాజారావు మాట్లాడుతూ, ఫారం పాండ్‌లో నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు చేపల పెంపకానికి కూడా అనుకూలంగా ఉంటుందని, తద్వారా రైతులకు అదనపు ఆదాయం లభించే అవకాశం ఉంటుందని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి. రాజారావు , వి బి జి రామ్, సిబ్బంది, గ్రామ సర్పంచ్ తేజావత్ వినోద్ కుమార్ మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

ఫారం పాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఎంపీడీవో పి. రాజారావు పాల్వంచ మండలంలోని తొగూడెం, జగన్నాథపురం, కారెగట్టు సత్యనారాయణపురం, మందారికలపాడు, లక్ష్మీదేవిపల్లి-ఖ, ఉలవనూరు, రేగులగూడెం, చంద్రలగూడెం మరియు మల్లారం గ్రామపంచాయతీలలో పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయా గ్రామపంచాయతీలలో ఇందిరమ్మ ఇండ్ల ఎల్1, హౌట్ హౌసెస్ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత వివరాలను వెరిఫికేషన్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## బిజెపి భద్రాద్రి జిల్లా మహిళా మోర్చా కమిటీ నియామకం

**– జిల్లా అధ్యక్షురాలుగా సముద్రాల గాయత్రి**

**– 26 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీ నియామకం**

**– బిజెపి అనుబంద మహిళా కమిటీని ప్రకటించిన జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి**



**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 20 (భద్రాద్రి న్యూస్) :**

భారతీయ జనతా పార్టీ అనుబంధ భద్రాద్రి జిల్లా మహిళా మోర్చా నూతన కమిటీని పార్టీ బిజెపి జిల్లా అధ్యక్షులు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రకటించారు. కొత్తగూడెం జిల్లా కార్యాలయంలో జరిగిన మహిళా మోర్చా కమిటీకి పూర్తిస్థాయి 26 మంది సభ్యులతో కూడిన కమిటీని నియమించారు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలుగా సముద్రాల గాయత్రిని నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షులు అధికారికంగా ప్రకటించారు. అదేవిధంగా అధ్యక్షురాలు సముద్రాలు గాయత్రి ఆధ్వర్యంలో 26 మంది సభ్యులతో కూడిన జిల్లా కమిటీని ప్రకటించడం జరిగింది. కమిటీలో ఉపాధ్యక్షులుగా కేతిని సావిత్రి, బానోత్ గంగ, అత్రం మమత, గరిక లక్ష్మి, ప్రధాన కార్యదర్శులుగా జల్ల స్వప్న, ముప్వ అపర్ణలను నియమించారు. అదేవిధంగా కార్యదర్శులుగా ధారావత్ పార్వతి, అడప వెంకట మణి, బట్టు సంధ్య, ఉయిక తులసిలను నియమించారు. కోశాధికారిగా భీమల్ సునీత, ఆఫీస్ సెక్రటరీలుగా భుఖ్య ఆశ, కొల్లె అనిత, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పల్లపు శిరీష, మంకీ బాత్ కన్వీనర్‌గా బండారి రాజేశ్వరి, ఐటీ కన్వీనర్‌గా పోలే మనస్విని, స్పోక్స్ పర్సన్‌గా భోగ లక్ష్మిలను ఎంపిక చేశారు. అలాగే తాండ్ర కుసుమ భవాని, ఏసు మని, ధారావత్ భారతి, ధారావత్ విష్ణు ప్రియ, పుట్ట వెంకటరమణ, పర్సగాని నాగమణి, పర్సగాని శ్రావణి, రావుల పద్మ, పుట్టి సుజాతలను కార్యవర్గ సభ్యులుగా నియమించారు. అనంతరం జిల్లా అధ్యక్షురాలు సముద్రాల గాయత్రి మాట్లాడుతూ... మహిళా మోర్చా నూతన కమిటీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహిళా శక్తిని మరింత బలోపేతం చేస్తూ, పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలకు ప్రత్యేకించి 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను, వివక్షతకు వ్యతిరేకంగా బిజెపి మహిళ ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బిజెపి పార్టీలో మహిళలకు కీలక బాధ్యతలు అప్పగించడం హర్షణీయమన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

## యోగా పోటీలలో ప్రథమ స్థానము పొందిన గుమలాపురం సత్యనారాయణకు భద్రాద్రి డిఇఓ అభినందనలు

**కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 20 (భద్రాద్రి న్యూస్) :**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వాసి అయిన స్థానిక కొత్తగూడెం వాస్తవ్యులు, పట్టణ ప్రముఖ యోగా గురువు గుమలాపురం సత్యనారాయణకు ఇంటర్నేషనల్ యోగ డే సందర్భంగా బెంగళూరు వారు నిర్వహించిన యోగా ఛాంపియన్షిప్ యోగా పోటీల యందు యోగా క్రీడాకారులుగా ప్రథమ స్థానము, అదేవిధంగా అనేక యోగ పోటీలకి అనేకమంది విద్యార్థిని విద్యార్థులను యోగా ఛాంపియన్షిప్ పోటీలకి ప్రోత్సహించి పాల్గొనేటట్టు చేసినందుకుగాను బెంగళూరు వారు ద బెస్ట్ యోగ టీచర్ అవార్డు అందజేసినారు. అదేవిధంగా ఈమధ్య చెన్నైలో జరిగిన సౌత్ ఇండియా యోగ ఆసన పోటీలు యందు సౌత్ ఇండియా ప్రథమ స్థానంలో గెలుపొందిన సందర్భంగా పట్టణ ప్రముఖ యోగ గురువును భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిస్టిక్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గారైన శ్రీమతి డి. వాసంతి మరియు ఎర్రమళ్ళ శ్రీనివాసరావు టీఎన్జీవోఎస్ జిల్లా నాయకులు, ఐడిఓ అభినందనలు తెలుపుతూ ప్రభుత్వ పాఠశాలల యందు యోగా నేర్పియోగాన్నిబాగ పెంపొందింప చేయాలని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో ఎం. మోహన్ ,వెంకటప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్ స్కిల్స్ శిక్షణ కార్యక్రమం ప్రారంభం!!

**పాల్వంచ, ఆగస్టు20 (భద్రాద్రి న్యూస్):**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో (స్వయంప్రతిపత్తి), పాల్వంచలో విద్యార్థుల ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం కోసం "ఉద్యోగ సాధికారత కోసం సాఫ్ట్ స్కిల్స్"లిపది రోజుల శిక్షణ కార్యక్రమంను కళాశాల టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ నియాజ్ పర్వీన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు.

ఈ కార్యక్రమాన్ని తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) మరియు ప్రథమ్ స్కిల్లింగ్ సెంటర్ వారు నిర్వహిస్తున్నారు. శిక్షకులుగా నర్సింహారావు వ్యవహరిస్తున్నారు. మొత్తం 30 గంటల పాటు జరిగే ఈ శిక్షణలో విద్యార్థులకు కమ్యూనికేషన్, వ్యక్తిత్వ వికాసం, ఆత్మవిశ్వాసం, ఇంటర్వ్యూ నైపుణ్యాలు తదితర అంశాలపై శిక్షణ అందించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులను ఉద్యోగాలకు సన్నద్ధం చేసి 100 శాతం ఉద్యోగ నియామక లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జె మాధవి డి రమేష్ డాక్టర్ కొండలరావు డాక్టర్ టి అరుణకుమారి పారెల్లి శ్రీనివాస్ కోటగిరి రాంబాబు డాక్టర్ స్వరూప రాణి డాక్టర్ ఎన్ శ్రీదేవి అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు అండగా భాగ్యనగర్ తండా సర్పంచ్

**గ్రామపంచాయతీ నిధులతో మృతదేహాల భద్రతకు శీతలీకరణ పెట్టె ఏర్పాటు**

**విషాద సమయంలో పేద కుటుంబాలకు ఆర్థిక భారం లేకుండా సేవ**

**మానవతా దృక్పథంతో ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చిన సర్పంచ్ హీరాలాల్**

**కారేపల్లి, ఆగస్టు 20 (భద్రాద్రి న్యూస్ ):**
కష్టకాలంలో పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ హీరాలాల్ మానవతా దృక్పథంతో ముందడుగు వేశారు. గ్రామపంచాయతీ పరిధిలో ఎవరైనా మృతి చెందినప్పుడు మృతదేహాన్ని భద్రపరిచేందుకు అవసరమైన శీతలీకరణ పెట్టెను గ్రామపంచాయతీ నిధులతో ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

గ్రామీణ ప్రాంతాల్లో పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందినప్పుడు మృతదేహాన్ని భద్రపరిచేందుకు శీతలీకరణ పెట్టె అవసరం ఏర్పడుతుంది. అయితే బయట ప్రాంతాల నుంచి అద్దెకు తెచ్చుకోవాల్సి రావడంతో పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితిని సర్పంచ్ బానోత్ హీరాలాల్ గుర్తించారు. దుఃఖ సమయంలో కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడకూడదనే ఉద్దేశంతో గ్రామపంచాయతీ నిధులతో ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేశారు.

### మానవ సేవే మాధవ సేవ

ప్రజలకు అవసరమైన సమయంలో తోడుగా నిలవడమే ప్రజాప్రతినిధుల బాధ్యత అనే ఉద్దేశంతో సర్పంచ్ హీరాలాల్ ఈ సేవను ప్రారంభించారు. గ్రామపంచాయతీ పరిధిలోని పేద, నిరుపేద కుటుంబాల్లో ఎవరైనా మృతి చెందినప్పుడు మృతదేహాన్ని భద్రపరిచేందుకు శీతలీకరణ పెట్టెను అవసరమైన వారికి అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

దీంతో పేద కుటుంబాలు ఇకపై బయట నుంచి శీతలీకరణ పెట్టెను అద్దెకు తీసుకురావడానికి డబ్బులు ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. కుటుంబంలో విషాదం చోటుచేసుకున్న



సమయంలో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారికి ఈ సేవ కొంతమేర ఉపశమనాన్ని కలిగించనుంది.

### ప్రజల కష్టాలను గుర్తించి సేవా కార్యక్రమం

సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధితో పాటు ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావాలనే లక్ష్యంతో బానోత్ హీరాలాల్ ముందుకు సాగుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలతో పాటు అత్యవసర సమయంలో ఉపయోగపడే సదుపాయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

పేద కుటుంబాల్లో విషాదం జరిగినప్పుడు వారి పరిస్థితిని అర్థం చేసుకుని, మృతదేహాన్ని గౌరవప్రదంగా భద్రపరిచేందుకు అవసరమైన శీతలీకరణ పెట్టెను గ్రామపంచాయతీ తరఫున అందుబాటులోకి తీసుకురావడం మంచి సేవా కార్యక్రమమని గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు అత్యవసర సమయంలో ఉపయోగపడే విధంగా శీతలీకరణ పెట్టెను అందుబాటులో ఉంచామని సర్పంచ్ బానోత్ హీరాలాల్ తెలిపారు. పేద కుటుంబాలకు అవసరమైన సమయంలో ఈ సదుపాయం అందించడం ద్వారా వారి బాధను కొంతైనా తగ్గించగలిగితే అదే తనకు సంతృప్తినిస్తుందని పేర్కొన్నారు.

"మానవ సేవే మాధవ సేవ" అనే నినాదాన్ని ఆచరణలో చూపిస్తూ పేద కుటుంబాలకు అవసరమైన సమయంలో అండగా నిలిచేలా ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేసిన సర్పంచ్ బానోత్ హీరాలాల్‌పై గ్రామస్తులు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

# నరసింహారావు మృతి బాధాకరం

**సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ**



**కారేపల్లి, ఆగస్టు 20 (భద్రాద్రి న్యూస్ రాములు):**
కారేపల్లి గ్రామానికి చెందిన భవనాసి నరసింహారావు (70) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ నరసింహారావు మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ సందర్భంగా మెరుగు సత్యనారాయణ మాట్లాడుతూ.. కొద్ది రోజుల క్రితమే నరసింహారావు సతీమణి లక్ష్మి మృతి చెందారని, ఆ విషాదం నుంచి కుటుంబం కోలుకోకముందే నరసింహారావు మృతి చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. ఆయన మృతి కుటుంబానికి తీరని లోటని పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్ మేదర వీర ప్రతాప్ టోనీ, ముక్క సీతారాములు, షేక్ బందేల్లి, పాసిని నాగేశ్వరరావు, ఇమ్మడి తిరుపతిరావు, షేక్ తాజుద్దీన్, నల్లబెల్లి ప్రతాప్, బట్టు రామ, మోతిలాల్, సుశీల తదితరులు ఉన్నారు.

# వర్షాలతో నిలిచిన నీరు.. దోమల బెడద

**మురుగు కాలువల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**దోమల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని గ్రామస్థుల విజ్ఞప్తి**

కారేపల్లి, ఆగస్టు 20 (భద్రాద్రి న్యూస్): వర్షాల కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల నీరు నిలిచిపోవడంతో దోమల సమస్య పెరుగుతోంది. మురుగు కాలువలు సక్రమంగా శుభ్రం కాకపోవడం, ఇళ్ల పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో దోమలకు అనుకూల వాతావరణం ఏర్పడుతోంది. దీంతో సాయంత్రం, రాత్రి వేళల్లో దోమల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



### నిలిచిన నీటిని తొలగించాలి

గ్రామాల్లో నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. మురుగు కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, నీరు సక్రమంగా ప్రవహించేలా కాలువలను శుభ్రం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దోమల వృద్ధికి కారణమయ్యే ప్రాంతాల్లో నివారణ మందులను పిచికారీ చేయాలని కోరుతున్నారు.

### పారిశుధ్యంపై నిరంతర పర్యవేక్షణ

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఇళ్ల పరిసరాల్లో వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచిస్తున్నారు.

### ముందస్తు చర్యలతోనే సమస్యకు అడ్డుకట్ట

దోమల సమస్య తీవ్రరూపం దాల్చిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ద్వారా సమస్యను నియంత్రించవచ్చని గ్రామస్థులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# పంచాయతీ పాలనపై శిక్షణ పొందిన సింగరేణి మండల సర్పంచులు

**హైదరాబాద్ శిక్షణ శిబిరంలో ఉసిరికాయలపల్లి, తోడితేలగూడెం సర్పంచులు పాల్గొన్నారు**



**కారేపల్లి, ఆగస్టు 20 (భద్రాద్రి న్యూస్ ):**
హైదరాబాద్‌లో నిర్వహించిన సర్పంచుల శిక్షణ శిబిరంలో సింగరేణి మండలానికి చెందిన ఇద్దరు సర్పంచులు పాల్గొని శిక్షణను విజయవంతంగా పూర్తి చేశారు. ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ వరలక్ష్మి రాజు, తోడితేలగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ ప్రియాంక కుమార్ శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు.

ఈ శిక్షణలో గ్రామపంచాయతీల పరిపాలన, గ్రామసభల నిర్వహణ, ప్రజల భాగస్వామ్యం, గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల బాధ్యతలు, గిరిజన ప్రాంతాల్లో స్థానిక పాలన తదితర అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. గ్రామాల అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజలకు అందించాల్సిన సేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను వివరించారు.

ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ శిక్షణలో తెలుసుకున్న అంశాలు గ్రామపంచాయతీల సమర్థవంతమైన పరిపాలనకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామసభలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని తెలిపారు.

శిక్షణ పూర్తి చేసుకున్న సర్పంచులను మండల ప్రజలు అభినందించారు. శిక్షణలో పొందిన అవగాహనను గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని ఆకాంక్షించారు.

# ప్రతి నీటి బొట్టు ను సంరక్షించు కోవాలి

**ఫారం ఫండ్ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన ప్రారంభించిన డి ఆర్ డి ఏ పిడి కొండపల్లి శ్రీరామ్**

**కామేపల్లి,ఆగస్టు20 (భద్రాద్రి న్యూస్):-**
రైతులు,ప్రజలు ప్రతి నీటి బొట్టును వృధా చేయకుండా సంరక్షించుకోవాలని డి ఆర్ డి ఏ పిడి కొండపల్లి శ్రీరామ్ పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని రుక్కి తండా.పొన్నెకల్. గోవింద్రాల గ్రామపంచాయతీలో రైతుల పంట పొలాల్లో ఫారం పండ్ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో ఫారం పండ్ లను నిర్మించుకోవడం వల్ల భూగర్భ జలాలు పెంపొందుతాయని వెల్లడించారు. గ్రామాల్లో ప్రజలు తమ తమ ఇండ్ల వద్ద ఇంకుడు గుంటలు నిర్మించుకోవాలని సూచించారు. తద్వారా వర్షాలు సమృద్ధిగా పడతాయని తెలిపారు.దీంతో నీటి కొరత కొంత మేరకు తీరుతుందని అన్నారు.ఈ





కార్యక్రమంలో గ్రామ సర్పంచులు గుగులోత్ రమాదేవి, బానోత్ కమల. గుగులోత్ భూమిక. ఎంపీడీవో సోమ్లాల్, ఎంపీఓ వివిఎస్ శాస్త్రి,ఏపీఓ,శ్రీ రాణి ఈసి,దామాల వెంకటేశ్వర్లు గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం డి ఫజల్.ప్రవీణ్. వసంత.టీఏలు భాహుసింగ్ సుప్రియ,మెట్స్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వే స్టేషన్ను రైల్వే డివిజన్ చేయాలి

**బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్**

**దక్షిణ మధ్య రైల్వే జోనల్ సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించి, పరిష్కరించాలన్నారు**





**భద్రాద్రి కొత్తగూడెం, (భద్రాద్రి న్యూస్) :**

కాజీపేట జంక్షన్, వందేళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన కొత్తగూడెం రైల్వే స్టేషన్లను (భద్రాచలం రోడ్) డివిజన్ కేంద్రాలుగా ప్రకటిస్తూ అభివృద్ధి చేయాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. తెలంగాణలో సికింద్రాబాద్ రైల్వే జోనల్ కేంద్రం కాగా, హైదరాబాద్ ఒక్కటే డివిజన్ గా ఉందని, ఈ దృష్ట్యా కాజీపేట, కొత్తగూడెంలను డివిజన్లుగా ప్రకటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బ్రిటీష్ వారి కాలంలో 1932లో కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఏర్పాటు జరిగిందని, దానికి భద్రాచలం రోడ్ స్టేషన్ అని నామకరణం చేశారన్నారు. అయితే, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన శ్రీరామచంద్ర స్వామి కొలువైన భద్రాచలం క్షేత్రంలో రైల్వే స్టేషన్ లేకపోవడం విచారకరమన్నారు. భద్రాచలంకు రైలు మార్గాన్ని పొడగిస్తూ, ఒడిషా, ఛత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు దీనిని విస్తరించడం ద్వారా ఆదివాసీ, గిరిజనులకు మేలు జరుగుతుందని, ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీ రవిచంద్ర వివరించారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే (ఎస్సీఆర్) పరిధిలోని పార్లమెంట్ మెంబర్స్ (ఎంపీలు) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర హిందీలో మాట్లాడుతూ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవకు వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, నిజామాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల ప్రజలు, ప్రయాణీకుల పక్షాన శ్రీవాస్తవకు ఎంపీ వద్దిరాజు వినతిపత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు తనతో పాటు పార్థసారథి రెడ్డి, రేణుకా చౌదరి, రఘురామిరెడ్డి, బలరాంనాయక్ మొత్తం 5 గురు ఎంపీలు ప్రాతినిథ్యం వహిస్తున్నామని చెప్పారు. ఈ జిల్లాలలో రైల్వే శాఖ చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించి తాము పలుమార్లు మంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తేవడం జరిగిందని, ఈ మార్గాన్ని భద్రాచలం వరకు పొడిగిస్తూ, భవిష్యత్తులో దానిని 5 రాష్ట్రాలకు కూడలిగా తీర్చిదిద్దాలని, భక్తజనుల సౌకర్యార్థం ఇక్కడ నుంచి తిరుపతికి రైళ్లు నడపాల్సిందిగా కోరారు. కొత్తగూడెం (భద్రాచలం రోడ్) రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను మరింత వేగవంతం చేస్తూ, వృద్ధులు, వికలాంగులు,చంటి పిల్లల తల్లులు 2వ ప్లాట్ఫామ్కు వెళ్లడం ఇబ్బందిగా ఉన్నందున,. ఎస్కలేటర్ సదుపాయం త్వరిత గతిన కల్పించాలన్నారు. భజన మందిర్, రాజీవ్ పార్క్ వద్ద అండర్పాస్లు నిర్మించాలని ఎంపీ రవిచంద్ర కోరారు. భద్రాచలం రోడ్ కొత్తగూడెం నుంచి తిరుపతికి ప్రత్యేక ట్రైన్ కావాలని ప్రయాణికులు ఎప్పటినుంచో అడుగుతున్నారని, దీనిని వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్--బెల్గావి ఎక్స్ప్రెస్ రైలును, కాజీపేట్--మణుగూరు ప్యాసింజర్ రైళ్ళను తిరిగి కొనసాగించాల్సిందిగా వినతిపత్రంలో ఆయన పేర్కొన్నారు.

# మినీ జాబ్ మేళాలో 50 మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు

**జాబ్ మేళాలో పెద్ద ఎత్తున పాల్గొన్న నిరుద్యోగ యువతీ యువకులు**

**వైరా, ఆగస్టు 20,( భద్రాద్రి న్యూస్)**



వైరా నియోజకవర్గ పట్టణ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం నిరుద్యోగ యువతీ యువకులకు మినీ జాబ్ మేళా ఇంటర్వ్యూ జరిగింది. ఈ కార్యక్రమానికి వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ పాల్గొని ఉదయం మినీ జాబ్ మేళాను ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రారంభించగా, వివిధ కంపెనీల ప్రతినిధులు నిర్వహించిన ఇంటర్వ్యూలకు నియోజకవర్గంలోని పలువురు నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ఇందులో భాగంగా సెలెక్ట్ అయిన 25 మంది అభ్యర్థులకు వివిధ కంపెనీల నుంచి కాల్ లెటర్లు అందజేయడం జరిగింది. మొత్తం 50 మందికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఈ మినీ జాబ్ మేళా ద్వారా అటెండ్ అయిన కంపెనీలు ఐసిఐసిఐ బ్యాంక్, ఎస్బిఐ టెలికాలర్స్, శుభ గుర హ ప్రాజెక్టు, ఈనాడు ప్రమోటర్స్, రామోజీ ఫిలిం సిటీ, ఆదిత్య బిర్లా గ్రూప్, నిధి ఐటీ కంపెనీ తదితర సంస్థలలో యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు లభించాయి.. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన యువతీ యువకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక చొరవ తీసుకొని వివిధ కంపెనీల యాజమాన్యాలతో మాట్లాడి నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ఎంతో ఆనందంగా ఉందని, తమకు ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కి కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి తో పాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఎమ్మెల్యే రామదాసు నాయక్ చేపడుతున్న కార్యక్రమాలపై యువత హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున నిరుద్యోగ యువతీ యువకులు ఈ మినీ జాబ్ మేళాలో పాల్గొన్నారు.

# సాతాని గూడెంలో ముమ్మరంగా ఫాగింగ్.. సీజనల్ వ్యాధులపై సర్పంచ్ రెడ్యా నాయక్ ప్రత్యేక దృష్టి

**కామేపల్లి,ఆగస్టు20 (భద్రాద్రి న్యూస్):**



కామేపల్లి మండలం సాతాని గూడెం గ్రామ పంచాయతీ పరిధిలో గత కొన్ని రోజులుగా తీవ్రమవుతున్న దోమల బారి నుండి అరికట్టడమే లక్ష్యంగా స్థానిక సర్పంచ్ రెడ్యా ఆధ్వర్యంలో ముమ్మరంగా ఫాగింగ్, పారిశుధ్య పనులు నిర్వహించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉండటంతో ముందస్తు గా పారిశుధ్య చర్యల్లో భాగంగా పంచాయతీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు.

ఈ సందర్భంగా గ్రామంలోని అన్ని వార్డుల్లో,మురికి కాలువలు, నిలిచివున్న నీటి గుంటల్లో దోమల నివారణ మందులను స్ప్రే చేయించారు.ఆ తర్వాత ప్రతీ వీధిలోనూ ఫాగింగ్ యంత్రాల ద్వారా దోమలను పోగొట్టేందుకు పొగ పిచికారీ చేసి దోమల ఉధృతిని తగ్గించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ రెడ్యా మాట్లాడుతూ.. "వర్షాల వల్ల డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వైరల్ జ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికే ఈ ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. నిరంతరం పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తాం" అని స్పష్టం చేశారు. అలాగే,గ్రామాన్ని స్వచ్ఛంగా ఉంచుకోవడంలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని ఆయన పేర్కొన్నారు. గ్రామస్తులు తమ ఇళ్ల పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి బొండాలు, కూలర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి,లావణ్య గ్రామ శాఖ అధ్యక్షుడు సత్య వీరబాబు,గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే జారే



**భద్రాద్రి న్యూస్ -- దమ్మపేట, ఆగస్టు 20:**

దమ్మపేట మండలం పార్కిలగండి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ కొమరం అర్జున్రావును ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురై ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న అర్జున్రావును కలుసుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పలు జాగ్రత్తలు సూచిస్తూ, పార్టీ పరంగా ఎల్లవేళలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ కోర్స సాగర్, యూత్ కాంగ్రెస్ నాయకులు శివాజీ, నాగేంద్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆసరా పెన్షన్లకు కొత్త దరఖాస్తుల ఆహ్వానం

**పేరుపల్లిలో అర్హులైన వారికి సర్పంచ్ పద్మావతి వీరభద్రం సూచన**

**గతంలో దరఖాస్తు చేసుకున్న వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలి**

**సింగరేణి, ఆగస్టు 20 (భద్రాద్రి న్యూస్ ):**



పేరుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులకు ఆసరా పెన్షన్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కొత్త దరఖాస్తు ఫారాలను విడుదల చేసినట్లు గ్రామ సర్పంచ్ పద్మావతి వీరభద్రం తెలిపారు.

ఇప్పటికే ఆసరా పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు కూడా తాజాగా విడుదల చేసిన దరఖాస్తు ఫారంలో మరోసారి వివరాలు నమోదు చేసి సమర్పించాలని సూచించారు. దరఖాస్తు ఫారాలు పేరుపల్లిలోని చిలక సతీష్ మెడికల్ షాప్, మెడికల్ శ్రీను షాప్ల వద్ద అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులు గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి దరఖాస్తు ఫారాలను సమర్పించాలని సర్పంచ్ పద్మావతి వీరభద్రం, గ్రామపంచాయతీ కార్యదర్శి కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# నివాళులర్పించిన బీ ఆర్ ఎస్ నాయకులు



**ఆగస్టు 20 (భద్రాద్రి న్యూస్ ):**

మంగపేట మండలం పి ఏ సీ ఎస్ చైర్మన్ తోట రమేష్ తండ్రి, తోట వీరయ్య మృతి చెందడం పట్ల బీఆర్ఎస్ పార్టీ మంగపేట మండల మాజీ అధ్యక్షులు, మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, జిల్లా సీనియర్ నాయకులు కుడుముల లక్ష్మి నారాయణ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వారి పార్థివదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తోట వీరయ్య ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పప్పు వెంకట్ రెడ్డి,చల్లగురుగుల తిరుపతి, పగడాల వెంకట్ రెడ్డి, నర్సింహాసాగర్ మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఉడుగుల శ్రీనివాస్ యాదవ్, కమలాపురం మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు తుక్కని శ్రీనివాస్, యూత్ నాయకులు పిల్లలమర్రి వేణు, గౌని రమేష్, పార్టీ సోషల్ మీడియా వారియర్స్, బీస సాంబయ్య, గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు,